# దొంగ

శ్రీమతి రాధాదేవి

కథానిక

చంద్రుడు పుట్టటం సాధారణ విషయము ఎల్లా ఔతుంది? ఎన్నో సంవత్సరాలు జీవితంలో అన్ని సుఖాలూవున్నా ఒక పెద్ద అభావమున్నట్లు కుమిలి పోతూఉండే శాస్త్రి శశిరేఖల జీవితంలోనే కాదు ఆ ఊరి చరిత్రలోకూడా చంద్రుడు పుట్టటం ఒక గొప్ప విశేషమే! నామకరణ మహోత్సవానికి శాస్త్రి యింట్లోజరిగినంత మహోత్సవం ఆ ఊళ్ళో ఏ పెళ్ళిలో కూడా జరుగలేదు. అంతవరకూ చీకటిగా ఎడారిగా ఉన్న జీవితం ఒక్క సారిగా ఏ దేవనదో ప్రవహించిన నందన వనమై పోయింది.

పూర్వం ఆ భార్య భర్తల కలహాలని కళ్ళారా చూసిన వాళ్ళకి తెలుస్తుంది చంద్రుడి మహాత్మ్య మెటువంటిదో! వాళ్ళిద్దరి మనస్సులకీ మధ్యవున్న అవకాశమంతా నింపేసి ఏకం చేస్తున్నాడు చంద్రుడు.

చంద్రుడు ఏడవటమంటూ తటస్థిస్తే ప్రపంచం తల కిందులై పోయిందన్న మాటే. నెల వెళ్ళక ముందు నుంచే క్యైర్యైమంటూ పోరు పెడుతూ ఉండేవాడు చంద్రుడు. ఆ ఏడుపువల్ల చుట్టు ప్రక్కల వాళ్ళకి విడ్డూరంగా కోపంగా ఉండేది. మూడు చంద్రుడు నెలలకే ఏడుపు గొట్టు పిల్లాడనే కీర్తి ఇంటిటా వ్యాపించింది. వాళ్ల ఇంటి పక్కన ఆరుగురు పిల్లల తల్లి పసిపిల్ల ఏడుస్తుంటే చెయ్యి వీలు లేక "వాళ్ల చంద్రుడి కైతే తగి పోయింది కాని, నీకూ నాకూ ఎల్లా చెల్లుతుందే, చంపుకు తింటున్నావు చెయ్యి దిగకుండా" అని గదమాయించటం దొడ్లో పని చేస్తున్న శశిరేఖ విన్నది. ముఖం కందగడ్డ అయిపోయింది. చేతులో ఉన్న చెంబు పక్క యింటి ఆవిడకి వినపడేట్లు ఒక విసురు విసరి ఏడుస్తూ భర్త దగ్గరకు వెళ్ళింది. శాస్త్రికొక్కూడా కోపమొచ్చింది. కాని సంబాళించుకుని "ఏడవటం పిల్లల హక్కు. వాళ్ళేడవక పోతే ఆ అన్న ఆవిడ ఏడుస్తుందా?" అని శశిరేఖను ఓదార్చాడు. ఈ గందరగోళానికి చీమ చిటుక్కుమంటే లేచి తన పరాక్రమాన్ని చూపే చంద్రుడు అమాంతంగా ఆరంభించాడు గుక్కపట్టి ఏడవటం. శశిరేఖ గభాలున పిల్లవాణ్ణి చేతుల్లోకి తీసికొని సముదాయిస్తూ అన్నది "అయినా చంద్రుడు ఏడుపులోకూడా ఏదో అందం వుందండీ!" అంది. శాస్త్రి యిన్నాళ్ళనుంచీ తన మనస్సులో ఉండి చెప్పటం చేతకాని అభిప్రాయాన్ని శశిరేఖ చక్కగా వెల్లడించటంవిని పొంగిపోతూ "కాకపోతే? ఇంకో వెధవ ఏడుపూ,మన చిట్టివాడి ఏడుపూ ఎల్లా ఒకటౌతుందే, ఏడిస్తే ఏమి వాడు రాజాకాడూ?" అని చంద్రుణ్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

చంద్రుడు బోర్లపడ్డప్పుడు పేరంటం... పారాడటంమొదలెట్టినప్పుడు పండగ, గడపదాటినప్పుడు ముత్తైదువులందరికీ గాజులు, పలుకులకి పసిపిల్ల బాలాదికీ చిలుకలు. ఇవన్నీ అల్లా ఉంచి, చంద్రుడి మొదటి పుట్టిన రోజు పండుగ ఆ వూళ్ళో వాళ్ళెవరూ మరిచిపోలేరు. చేతులకు మురుగులూ మెళ్ళో గొలుసులూ, కాళ్ళకి గొలుసులూ, మొల్లో గజ్జెలూ, సిల్కు చొక్కా తొడుక్కుని కుర్చీలో కూర్చున్న చంద్రుడికి మంగళహారతి ఇస్తుంటే అందరికీ ఆనందమే కాదు అసూయకూడా కలిగింది, ఆ దంపతుల అదృష్టానికి!

చిలక పలుకులతో చంద్రుడు మొదటి సారి 'అమ్మా. నాన్నా' అన్న రోజు ఆ దంపతులిద్దరికీ స్వర్గమేవచ్చి పిలిచినట్లనిపించింది. ఏ క్షణాన్న చంద్రుడు తప్పటడుగులు వెయ్యటం ఆరంభించాడో, అప్పుడే వాళ్ళిదరి హృదయల్లోనూ ఈ జగత్తులో తమ వంశం చిరస్థాయి అయిపోగలదన్న అపరిమితానందంతో కూడిన గర్వంకూడా కలిగింది.

2

చంద్రుడికి ఏడాది వెళ్ళింది. నల్లటి ఉంగరాలజుట్టు వ్రేలాడుతుండేది చిలిపిగా ఉండే కళ్ళ మీదికి. ఊళ్ళోకి ఏ యే రకాల కొత్త గుడ్డలు వచ్చినవో తెలుసుకోవాలంటే చంద్రుణ్ని చూస్తేచాలు, లాగూ చొక్కా కలిపికుట్టినది

తొడుక్కుని చిన్న కాళ్ళకి మేజోళ్లు, ముఖమల్ బూట్లూ తొడుక్కొని చిన్న hat పెట్టుకొని తండ్రి ఒళ్ళో కూర్చుని ముందు ఆటవస్తువులు గుంపులుగా పోసుకొని ఉండటంచూచి అసూయపడని పిల్లవాడు ఆ వూళ్ళో లేడు. అందరూ గుంపులు గుపుంలుగా వచ్చి చంద్రుడి చుట్టూ మూగి ఒక్కసారి ఆ మోటార్లనీ సెల్యులాయిడ్ బొమ్మల్ని ముట్టుకోనిస్తే చాలునని ఆత్రంగా ఎదురుచూస్తూవుండే వాళ్ళు. వాళ్ళు తన ముందు గంతులేస్తుంటే కిలకిల నవ్వే వాడు, కాని సుతేమిరా ఒక్కణ్నీ తన గుఱ్ఱాన్నికాని మోటార్నికాని తాక నివ్వక పోగా దగ్గిరకుకూడా రానిచ్చే వాడు కాదు.

చంద్రుడికి యధావిధిగా డ్రస్సంతావేసి కాఫీ అయిసాక సూర్యుడెక్కడవాణ్ని చూసిపోతాడో అని గొడుగు వేసి యింటింటికీ తిప్పుకొచ్చేవాడు శాస్త్రి. ఒక్కచోటా చంద్రుడు కూచునేవాడు కాదు. ఎవరైనా ఎత్తుకోటానికి రమ్మని పోతారని మనుషుల్ని చూడగానే సంగీతం ఆరంభించేవాడు. ఈ పర్యటనమై ఇంటికి వచ్చినాక ప్రతిరోజూ శశిరేఖ రెండు క్రతువులు చెయ్యాల్సొచ్చేది. మొదటిది నీళ్ళు పొయ్యటం. గుప్పెళ్ళనిండా బిళ్ళలు పెట్టేవాళ్ళు అందరూ. ఎదురుగుండా మొగ్గలేసే బొమ్మకి కీ ఇచ్చి నిల బెట్టేవాళ్ళు. శాస్త్రి కాళ్ళూ చేతులూ పట్టుకొని మనస్సులో



" చంద్రుడు మూతినిండా మామిడిపండురసం పులుముకొనివచ్చి......"

పోనీ ఇంత కష్టపెట్టే బదులు వీళ్ళే మానేస్తేయేం అను కుంటూ మరిపిస్తూ ఉంటే, శశిరేఖ ఎన్నిసార్లు రుద్దితే అంత చక్కగా ఉంటాడన్నట్లుగా సబ్బుతో పదిసార్లు రుద్ది నీళ్ళుపోసి తుడిచే సరికి తలప్రాణం తోకకొచ్చేది. తుడిచి పౌడరు రాసి డ్రస్సంతా వేసేసరికి ఇంకా గుక్క తిప్పు కోకండా ఏడుస్తూనే ఉండేవాడు చంద్రుడు. రెండు ఈ యజ్ఞం అయినాక అన్నం తినిపించటం. శాస్త్రి వెళ్ళి ఊళ్ళో పిల్లల్నందరినీ పోగేసుకొచ్చి వాళ్ళందరూ చుట్టూ మూగి పలకరిస్తుంటే ఒళ్ళో కూర్చోపెట్టుకొని గోరుముద్దలు పెడు తుంటే సగం సగం మీద ఉమ్మేసీ వెండి గిన్నెలో ఉన్న ముద్దలు తన చేతుల్తో చుట్టూ విరజిమ్మి ఎట్లో నోరు తెరచే వాడు. ఈ యజ్ఞం ముగిశాక వచ్చిన పిల్లలందరికీ చాటుగా తీసుకెళ్ళి బిళ్ళలు పెట్టాల్సొచ్చేది. చంద్రుడు ఇది చూస్తే రాగాలు పెట్టి దొర్లుతాడు. పిల్లలెప్పుడూ చుట్టూ ఉంటే ఆడుకునేవాడు కాని, వాళ్ళని తనని ఎత్తుకోనివ్వక పోగా ముట్టుకోనివ్వటం లేకపోగా, తండ్రినికాని, తల్లినికాని వాళ్ళకేమీ పెట్టనిచ్చేవాడు కాదు. తనకి ఎవరైనా ఏమయినా పెడితే చంద్రుడు గభాలున నోట్లో వేసుకొనే వాడు. వాళ్ళు ఎత్తుకుంటామంటే మాత్రం గుక్కపడతాడు.

చంద్రుడు దిన దిన ప్రవర్ధమాను డౌతున్న కొద్దీ పెంకి తనంకూడా పెరిగి పోయింది. మొదట ఇది ఆ దంపతు

లిద్దరికీ ఎంతో ముద్దుగా ఉండేది. రానురానూ కొంచెం విసుగుగా ఉండేది శశిరేఖకి, కాని శాస్త్రికి మాత్రం చంద్రుడి శాసనం నిర్వర్తించటంలో ఉన్న సంతోషం మరే దాంట్లోనూ లేదు. శశిరేఖ విసుక్కునేది కాదు పైటికి. అక్కడికీ పట్టలేక ఎప్పుడైనా చంద్రుణ్ని కాస్త అదలించితే శాస్త్రి ఆ వేళ అంతా మూతి ముడుచుకునేవాడు.

ఒకనాడు శాస్త్రి మిత్రులతో అరుగుమీద పేక ఆడుతున్నాడు. చంద్రుడు మూతినిండా పొట్టనిండా మామిడి రసం పులుముకుని పరిగెత్తుకొచ్చి ఆడుతున్న వాళ్ళందరి బట్టలకీ చేతులు పులిమాడు. వాళ్ళు ఏమీ అనలేక కిక్కురుమనకుండా పూరుకున్నారు. శాస్త్రికి పట్టలేని సంబరమొచ్చింది కొడుకు చేసిన ఘనకార్యానికి. ఇంతలో ఉత్త పుణ్యానికి చంద్రుడు "పిల్లందరినీ ఎల్లిపో..." అని ఏడుపు ఆరంభించాడు. ఇది విని శశిరేఖ చిన్నబోయింది. శాస్త్రికి కొంచెం కష్టంగా తోచినప్పటికీ "పోనీ లేరా ఇవాళటికి కట్టివేదాం ఆట" అన్నాడు. అంతా వెళ్ళి పోయారు. కాస్సేపు ఊరుకున్నట్లే ఉండి మళ్ళీ శోకం మొదలు పెట్టాడు "వాల్లని పిలో..." అని. ఊరంతా తన పిల్లాణ్ని గురించి విడ్డూరంగా చెప్పుకోటం వింటుంటే శశిరేఖకు సిగ్గుగా ఉంది. ఈ పెంకితనం ఎల్లా మాన్పటం? భర్తమీద కోపంకూడా వచ్చింది.

అది చంద్రుడి అయిదో పుట్టిన రోజు. ఊరంతా భోజనాలకి వచ్చి విస్తళ్ళముందు కూర్చున్నారు. వడ్డనకూడా అయిపోయింది. ఏ మూలనుంచో పరిగెత్తుకొచ్చి చంద్రుడు వంటింటి గడప కడ్డంగా పడుకుని ఇల్లంతా ఎగిరిపోయేట్లు ఆరంభించాడు. అంతా లేవబోయారు. "వీళ్ళంతా మన ఇంటికి..." అని కాళ్ళు బాదుకుంటూ గందరగోళం చేస్తున్న చంద్రుణ్ని కోపంతోనూ, సిగ్గుతోనూ, చిన్నబోయిన ముఖంతో, వచ్చిన వాళ్ళందరికీ ఎక్కడ వినపడిపోతుందో అని నోరు మూసి బలవంతాన ఈడ్చుకు వెళ్ళి గదిలో పెట్టి గొళ్ళెంవేసి వచ్చింది శశిరేఖ.

దినాలు తిరిగి పోతున్నయ్. శశిరేఖ ప్రతిఘటనతోపాటు చంద్రుడి మొండితనంకూడా అతిశయించి పోతున్నది. వద్దని చెబుతున్నా చంద్రుడు మడిలో ఉన్న ఊరగాయ జాడీలని పోయి తాకాడు. సావిట్లో ఉన్న శాస్త్రి భార్య కొడుకు చెంపమీద వేసిన దెబ్బవిని పరుగెత్తుకొచ్చాడు. చంద్రుడు కిందపడి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చెంపమీద చెయ్యి పెట్టుకుని. చెంపమీద వేళ్ళు తేలినయ్. చంద్రుణ్ని అమాంతం ఎత్తుకుని తెల్లబోయి నిలబడి ఉన్న శశిరేఖ చంప పేలేట్లుగా చంద్రుడి చేతికి తన చేతిని జోడించి అంటించాడు. శశిరేఖ తిన్న మొదటి దెబ్బ అది కాదు కాని చంద్రుడు తిన్న మొదటి దెబ్బ మాత్రం అదే.

ఒకనాడు ప్రొద్దున్న ఊరంతా ఎగిరిపోయేట్లు ఏడుస్తూ దొర్లటం ఆరంభించాడు చంద్రుడు. ఊరుకోలేక శాస్త్రి కూడా చెయ్యి చేసుకోవలసివచ్చింది చివరకి. శశిరేఖ చంద్రుడి ఆభరణాలన్నీ తీసివేసి తొట్టెలో ఉన్న పసివాడికి సింగారించింది.

తరువాత కొన్నాళ్ళకి అట్టే ఆర్భాటం లేకుండా చంద్రుడి అక్షరాభ్యాసం జరిగింది. అందరి పిల్లల మాదిరిగానే పలక పుచ్చుకుని వీధి బళ్ళోకి పోతున్నాడు.

చంద్రుడి చిన్న బుర్రకి తన కేదో అన్యాయం జరుగుతున్నట్లు తోచ సాగింది. ఇదివరకు తల్లి తండ్రులకు తన మీద ఉన్న ముద్దంతా ఒక్కసారిగా మాయమైపోయింది. దీనికి కారణం? తన వస్తువులన్నీ దొంగిలించి వేస్తున్న దెవరు? దీని కంతకీ తొట్టెలో ఉన్న తమ్ముడేనా? వాడేనా దొంగ?

ఆనాడు ప్రొద్దున్న శశిరేఖ చంద్రుడి చేతులకున్న మురుగులుకూడా తీసివేసి చిన్నవాడి చేతుల కలంకరించింది.

చంద్రుడు కన్నీళ్ళు కుక్కుకుంటూ పైకి ఏడిస్తే తండ్రి కొడతాడేమోనన్న భయంతో కిక్కురుమనకుండా బళ్ళోకి బయలుదేరాడు. ఆకాశంలో కృష్ణపక్షపు చంద్రుడు సూర్యుడుదయించినాక తన కేసి ఎవరూ చూడటం లేదనే విచారంతో, వెలవెల బోతూన్నట్లేవుంది చంద్రుడు బడికి పోవడం.